క్లుప్తంగా

ఘనంగా శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కోలా సన్యాసిరావు రోడ్డులోని కొబ్బరితోట సెంటర్‌లో శనివారం భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీవెంకయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కోలా కనకారావు ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు భోజనాలు వడ్డించారు. వెంకయ్యస్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయల్ 100, 112, ఎస్‌వోఎస్ కాల్స్ పర్యవేక్షణ పనితీరును పరిశీలించిన అనంతరం అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నగరంలోని సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షిస్తుండాలని, ట్రాఫిక్ రద్దీ వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో డైనమిక్‌గా వ్యవహరించాలని సూచించారు. అసాంఘిక శక్తుల కదలికలను పసిగడుతూ సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీపీ వెంట డీసీపీలు గౌతమిశాలి, ఉదయరాణి, హరికృష్ణ, ఏసీపీ తేజేశ్వరరావు, సీఐలు హనీష్, గుణరాము, శ్రీను, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందని, యువత వాటికి దూరంగా ఉండాలని సింగ్‌నగర్ ఎస్‌ఐ శ్రీనివాసరావు సూచించారు. సింగ్‌నగర్ సీఐ కె.శివాజీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం యాంటీ డ్రగ్ నార్కో బీట్‌ను నిర్వహించారు. శివారు ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు చేసి, యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు ఆకర్షితులు అయితే ఆ తర్వాత వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటారని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని, క్రీడలతో పాటు ఆసక్తి గల రంగాల్లో రాణించాలని సూచించారు.

నేరాలపై అవగాహన సదస్సు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భారతమాత మందిరం రోడ్డులో ఉన్న గ్రీన్ మెడోస్ అపార్ట్‌మెంట్ వాసులకు శనివారం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పెద్దిబోయిన శ్రీనివాసరావు నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను అపార్ట్‌మెంట్లోనికి రానివ్వకూడదని, అపార్ట్‌మెంట్లు, నివాసాలకు అన్ని వైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో జాబ్‌లు, గిఫ్ట్‌లు అంటూ సైబర్ నేరాలు జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే 100 నెంబర్‌కు కానీ, సమీప పోలీస్‌స్టేషన్‌కు కానీ సమాచారం అందించాలని కోరారు. సింగ్‌నగర్ సీఐ శివాజీ, క్రైమ్ ఎస్సై బి. శ్రీనివాసరెడ్డి, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని శ్రీభవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు ఆధ్వర్యంలో 44వ డివిజన్ పరిధిలోని చెరువు సెంటర్ వద్ద గల యద్దనపూడివారి వీధిలో శనివారం భారత్ గ్యాస్ వినియోగదారులకు అవగాహన శిబిరం నిర్వహించారు. వంట గ్యాస్ లీక్ అయ్యి వాసన వచ్చినప్పుడు వెంటనే సిలెండర్‌కు ఉన్న రెగ్యులేటర్‌ను కట్టేయాలని, అనంతరం మూసి ఉన్న కిటికీ తలుపులను తెరవాలని సూచించారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1906కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

రెస్క్యూ టీమ్ ఏర్పాటు చేయాలి



కోల్‌కత్తా ఘటన తీవ్రంగా కలచివేసింది. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రోగుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలి. అప్పుడే మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించగలుగుతారు. ఆసుపత్రి స్థాయిలో రెస్క్యూ టీమ్ ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ వీర్నాల గౌతం అంబేడ్కర్, మెడికల్ ఆఫీసర్



నిందితులను కఠినంగా శిక్షించాలి

వైద్యులు, మహిళలపై దాడులు జరగడం విచారకరం. మహిళలకు పూర్తి భద్రత కల్పించాలి. వైద్యులు, మహిళా సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరించాలి. దుబాయ్ తరహాలో తక్షణమే శిక్షలు అమలు చేయడం ద్వారా దాడులు జరగకుండా చూడవచ్చు.

– మోపిదేవి కోకిలాంబ, ఫార్మాసిస్ట్



అధ్వానంగా మధురానగర్ రైల్వేస్టేషన్ పరిసరాలు

- పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, చెత్తచెదారం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రైల్వేస్టేషన్ పరిసరాలు అధ్వానంగా మారాయి. రైల్వేస్టేషన్ పరిసరాలు చెత్తచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయి విషసర్పాలు, దోమలకు ఆవాసకేంద్రాలుగా ఉన్నాయి. దీంతో ఇక్కడ రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు. మధురానగర్ ఆర్‌యూబీ పనుల్లో భాగంగా ఇక్కడ రైల్వేస్టేషన్ సర్వీసు రోడ్డు మూసివేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆర్‌యూబీ పనులు పూర్తయినప్పటికీ ఈ రోడ్డును మాత్రం పట్టించుకున్న వారే కరువయ్యారు. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతోపాటు ఎవరికి వారు చెత్తచెదారం వేయడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. అలాగే ఈ ప్రాంతంలో విషసర్పాలు సంచరిస్తుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతాన్ని రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇక్కడ మూడు సంవత్సరాలుగా రైల్వేస్టేషన్ ఎదురుగా కంకర వదిలేశారు. స్థానికులు రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని పార్కింగ్ ప్రాంతంగా వినియోగిస్తున్నారు. రైల్వే అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ వద్ద పెరిగిపోయిన పిచ్చి మొక్కలు



రైల్వేస్టేషన్ వద్ద వదిలేసిన కంకర



అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

ఈ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురావాలి



ఇక్కడ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. అపరిశుభ్రంగా మారిన పరిసరాలను రైల్వే సిబ్బంది సరి చేయాలని నగరపాలకసంస్థ సిబ్బంది చెబుతున్నారు. ఎవరికి వారు వంతులు వేసుకోకుండా ఈ ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురావాలి. చెత్తచెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమలు, విషసర్పాల సంచారం అధికం అయ్యింది. రాత్రయితే చాలు బయటకి రావాలంటేనే భయం వేస్తుంది. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేయాలి.

– కాకర్ల శివ, మధురానగర్

నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

పటమట(విజయవాడతూర్పు): స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న వాసవ్య నర్సింగ్ హోంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సమరం మాట్లాడుతూ.. స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ 29 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఇప్పటి వరకు తమ సంస్థ ఆధ్వర్యంలో 900 మందికి నేత్రదానంతో చూపు కల్పించామన్నారు. దేశంలో 35 లక్షల మంది నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్నారని, నేత్రదానంతో నల్లగుడ్డు అంధత్వం ఉన్న వారికి చూపు కల్పించవచ్చని చెప్పారు.

రేపు పక్షోత్సవాల సభ

నేత్రదానంపై అవగాహన రాహిత్యం, మూఢత్వంతో చనిపోయిన వారి కళ్లు దానం చేసేందుకు ముందుకు రాకపోవడంతో చాలా మంది చూపును పొందలేక పోతున్నారన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయని, 26న నాస్తిక కేంద్రంలో పక్షోత్సవాల సభ ప్రారంభమవుతుందని, 28న నేత్రదానంపై అవగాహన కల్పించే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. 29న నేత్రదానంపై విద్యార్థులకు వ్యాసరచన, 30న చిత్రలేఖనం, సెప్టెంబర్ 2వ తేదీన స్లోగన్ పోటీలు, 3న పాటల పోటీలు, 4న క్విజ్ పోటీలు, 5న అంధ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 97040 20303 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దీక్ష, డాక్టర్ మారు, నియంత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జి.సమరం, పక్కన వైద్యులు

విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆకాంక్షించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో పలు క్రీడల్లో రాణించిన క్రీడాకారులను కమిషనర్ శనివారం అభినందించి , అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో ఎన్నో పతకాలను సాధించిన చైత్రదీపిక, దియాశ్రీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఎస్‌ఎం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చైత్రదీపిక ఇటీవల పొల్లాచి (కోయంబత్తూరు)లో జరిగిన 2వ ఇండియా స్కేట్ గేమ్స్, 2024లో 14 – 17 ఏళ్ల విభాగంలో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో మూడు పతకాలు–సోలో డ్యాన్స్(రజతం), ఫ్రీ స్కేటింగ్(రజతం), క్వార్టెట్(కాంస్యం)తో పాటు 59, 60, 61వ రోలర్ స్కేటింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుందన్నారు. గతేడాది బిజినింగ్ చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పసిడి పతకాలు సాధించింది. అలాగే 11 – 14 ఏళ్ల కేటగిరీలో దియాశ్రీ పెయిర్ స్కేట్‌లో(కాంస్యం), సోలో డ్యాన్స్ (రజతం) పతకాలు సాధించింది. క్రీడాకారుల ప్రోత్సాహానికి వీఎంసీ కృషి చేస్తోందని కమిషనర్ తెలిపారు.

కుళాయి సర్వే వేగవంతం చేయాలి

విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో ఉన్న ప్రతి తాగునీటి సరఫరా అసెస్మెంట్‌కు కచ్చితంగా సర్వేను నిర్వహించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నిర్వహించిన సర్వే నివేదికలో ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇప్పటి వరకు విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో ఉన్న 2,33,121 అసెస్మెంట్‌లకు 2,20,592 అసెస్మెంట్లకు ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి సర్వేను పూర్తి చేశారన్నారు. దాదాపు 94 శాతం సర్వే పూర్తయిందని, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి 100 శాతం సర్వేను సత్వరమే పూర్తి చేసి నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సర్కిల్‌లో సర్వే పరిశీలనపై జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, ఇంజినీరింగ్, అధికారుల సహకారంతో సత్వరమే ప్రతి ఇంటి తాగునీటి కుళాయి సర్వేను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను కలిసిన రోలార్ స్కేటింగ్ క్రీడాకారులు

నేటి నుంచి ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఉత్సవాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ మందిర ప్రతినిధులు బలరాం గోవిందదాస్ తెలిపారు. పాత వీబీఎం కాలేజీలోని ఇస్కాన్ మందిరంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం గోవిందదాస్ మాట్లాడుతూ.. ఈ ఏడాది శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం జగన్నాథ మందిరంలో 2 వేల కిలోల పుష్పాలతో జగన్నాథస్వామివారికి మహా పుష్పాభిషేకం, పంచామృతాలతో కలశాభిషేకం, జిల్లా స్థాయిలో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వామి వారికి 108 రకాల నైవేద్యాలు సమర్పిస్తామన్నారు.

చిన్నారులకు శ్రీకృష్ణ కాంపిటీషన్స్..

26న స్వామివారికి మహాశంఖాభిషేకం, కీర్తనలు, ధూప దీప నైవేద్యాల సమర్పణతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు చెప్పారు. 7 ఏళ్లలోపు పిల్లలకు శ్రీకృష్ణ కాంపిటీషన్స్, ఉట్టి మహోత్సవ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు రాధా శ్యాంసుందర్, జనరల్ మేనేజర్ వేణుదారిదాస్, వజ్రదాందాస్‌లు పాల్గొన్నారు.



కృష్ణాష్టమి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బలరాం గోవిందదాస్ తదితరులు

రేపు శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం శ్రీకృష్ణ రంగనాథ స్వామివారికి అభిషేకాలు అర్చనలు, సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

28 నుంచి హరికథా ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో 28వ తేది నుంచి ఐదు రోజుల పాటు ఆదిభట్ల నారాయణ దాసు 160వ జయంతి సందర్భంగా హరికథా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ బుర్రా పద్మనాభశాస్త్రి తెలిపారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 28 నుంచి సెప్టెంబర్ ఒకటో తేది వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భాగవతులు హరికథలు వినిపిస్తారని తెలిపారు. ప్రతి రోజూ కవి పండిత సత్కారం, ఒకటో తేది సాయంత్రం ఆరు గంటలకు నారాయణదాసు జయంతి సభ జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యుడు యనమండ్ర వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావు పేట సెక్షన్ జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ డోర్నకల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, డోర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, కాశేశ్వరరావు రోడ్డు, గోవిందరాజులు నాయుడు వీధి, తాడేపల్లివారి వీధి, పీసపాటివారి వీధి, టొబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ యస్.సుబ్బారావు వీధి, దాసరివారి వీధి, సూర్యనారాయణ వీధి, వేమూరివారి వీధి, జడగంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

27న ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజారోగ్య పరిరక్షణ పేరుతో సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 27న చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర 27న ఏ. కొండూరులో ప్రారంభమై 29న విజయవాడ లెనిన్ సెంటర్‌లో ముగుస్తుందని తెలిపారు. ముగింపు సందర్భంగా లెనిన్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం కిడ్నీ బాధిత ప్రాంతాలకు కృష్ణా జలాలు సరఫరా చేయాలని, పరిశ్రమల్లో కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని పేర్కొన్నారు. కిడ్నీ బాధితులను ఆదుకోవాలన్నారు. పార్టీ నాయకులు జి. కోటేశ్వరరావు, పరుచూరి రాజేంద్ర, లంక గోవిందరాజులు పాల్గొన్నారు.

శ్రీ విజ్ఞాన పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీ కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం జరిగింది. విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో కనువిందు చేశారు. శ్రీరాధాకృష్ణ, గోపికల వేషధారణలతో చిన్నారులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

మాతృభాషతోనే మనోవికాసం

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనోవికాసం కలుగుతుందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్, దామోదర జానపదం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం తెలుగు భాషా దినోత్సవం, అంతర్జాతీయ జానపద దినోత్సవం వేడుకలను నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రమాదంలో పడిందని భవిష్యత్‌లో కనుమరుగు అయ్యే ప్రమాదముందని మేధావులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జానపద గీతాలకు ఎల్లలు లేవన్నారు. సమాజంలో చైతన్యం కలిగించేవి జానపద గీతాలలేని అన్నారు. జానపద గాయకుడు డాక్టర్ దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపద గీతాలు శ్రామిక జీవనానికి సోపానాలు అని అభివర్ణించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గణపతిరావు తన బృంద సభ్యులు జాస్తి కృష్ణ సింధూ, లింగదాస్, అనిల్‌కుమార్, రూపాదేవి, సిరిమోక్షలతో జానపద చిత్రగీతాలను ఆలపించారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన గోలి రవిచంద్ర, దాసరి లక్ష్మీసంధ్య, పసుపులేటి వెంకటరమణ, చప్పిడి సత్యనారాయణ, రవి, మాకాని హరిచందన, డాక్టర్ రాయవరపు సత్యభామ, దిలీప్‌కుమార్, దాసరి సంధ్యలకు కృష్ణవేణి కవితా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, మహంతి వాసుదేవరావు, మాసా బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి కవితా పురస్కారాలను అందుకున్న వారితో మండలి బుద్ధప్రసాద్ తదితరులు

కేరళ వరద బాధితులకు ఆర్థిక సాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కేరళ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం భవానీపురంలోని నేతాజీ హైస్కూల్ విద్యార్థులు, యాజమాన్యం రూ.85,500 ఆర్థిక సహాయం అందించింది. నగదు చెక్కును హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.అరుణకుమారి శనివారం ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు అందజేశారు. ఆయన చేతుల మీదుగా కేరళ ప్రభుత్వ రిలీఫ్ ఫండ్‌కు ఆర్థిక సహాయం పంపనున్నట్లు అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేరళ వరదల్లో చిక్కుకొని వందలాదిమంది మృతి చెందడం, వేలాదిమంది నిరాశ్రయులు కావడం బాధాకరమన్నారు. కేరళ వరదల విషయాన్ని తమ హైస్కూల్ విద్యార్థులకు తెలియజేసిన వెంటనే వారు స్వచ్ఛందంగా స్పందించి విరాళాలను సేకరించామని చెప్పారు. హైస్కూల్ విద్యార్థులను, యాజమాన్యాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కె.రాజేష్, కె.దినేష్ ,శిరీష, లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఆపరేషన్ ఖగార్‌కు వ్యతిరేకంగా ధర్నా


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్పొరేటీకరణ, ఆపరేషన్ ఖగార్‌కు వ్యతిరేకంగా 26వ తేదీ సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కులను పరిరక్షించే చట్టాలను తుంగలో తొక్కి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. ఆదివాసీలను మావోయిస్టులుగా చిత్రీకరించి చంపేస్తున్నారన్నారు. చత్తీస్‌ఘడ్‌లోని బీజేపీ ప్రభుత్వం 177 మంది అమాయక ఆదివాసీలను చంపేసిందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ఖగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా నిర్వహించే ధర్నాలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఐఏఎస్ బండ్ల శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం నాయకులు టి.ఆంజనేయులు, విరసం నాయకులు అరసవల్లి కృష్ణ, కొండారెడ్డి, వెంకటేశ్వరరావు, చిగురుపాటి భాస్కరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

జగన్‌మోహన్‌రావుకు ప్రైడ్ భారత్ అవార్డ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ భారత్ – 2024 అవార్డ్ లభించింది. గిరిజనుల జీవన విధానంపై కాన్వాస్‌పై అత్యధిక చిత్రాలను పెయింటింగ్ చేయడంతో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌కు చెందిన ది గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వారు ఈ అవార్డ్‌ను ప్రకటించారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఆయన నివాసానికి నిర్వాహకులు కొరియర్ ద్వారా పంపిన అవార్డ్‌ను శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండ, కోనల్లో నివసించే గిరిజనుల జీవనశైలి, వారు అనుభవిస్తున్న కష్టనష్టాలు తదితర సామాజిక అంశాలపై తాను పెయింట్ చేసిన అనేక చిత్రాల్లో సుమారు 200 జాతీయ, అంతర్జాతీయ అవార్డ్‌లను అందుకున్నానని చెప్పారు. ఆదివాసీలైన గిరిజనులకు సైతం సమాజంలో తగిన గౌరవం, న్యాయం దక్కాలనే ఉద్దేశంతోనే తాను ట్రైబల్ లైఫ్‌కు సంబంధించిన చిత్రాలకు ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. సమాజానికి చిత్రకళ ద్వారా సేవలందించాలనే లక్ష్యంతో చిత్రకారులు పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన చిత్రాలను గీయాలని కోరారు. ప్రైడ్ భారత్ అవార్డ్ అందుకున్న ఆయనను పలువురు చిత్రకారులు అభినందించారు.



అవార్డ్‌తో జగన్‌మోహన్‌రావు

ప్రకటన

[illegible]